క్లుప్తంగా

ఎంపీడీవోకు ఘన సత్కారం



నందిగామరూరల్: ప్రభుత్వాధికారులకు బదిలీలు సాధారణమని ఎక్కడ పనిచేసినా ప్రజల మన్ననలు పొందేలా పనిచేయాలని జెడ్పీటీసీ సభ్యుడు గాదెల వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. బదిలీపై వెళ్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావును సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాసరావు మాట్లాడుతూబదిలీపై వెళ్తున్నందుకు బాధగా ఉన్నా ఏపీడీగా ఉద్యోగోన్నతిపై వెళ్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. నందిగామ మండల అధికారులు, సిబ్బంది, నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో కార్యాలయ ఏవో సబిత, డిప్యూటీ ఎంపీడీవో నామేశ్వరరావు, సీనియర్ అసిస్టెంట్ నాగలక్ష్మి, సిబ్బంది మనీషా, ఈశ్వర్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ



పెనుగంచిప్రోలు: యూ–విన్ యాప్‌లో మీ చిన్నారుల పేర్లు నమోదు చేసుకోవాలని వైద్యాధికారి నాగలక్ష్మి సూచించారు. మండలంలోని పెనుగంచిప్రోలులో సోమవారం యూ–విన్ యాప్‌పై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ యూ–విన్ ద్వారా చిన్నారులకు సకాలంలో టీకా వేసేందుకు తల్లిదండ్రులకు ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం అందిస్తున్నట్లు తెలిపారు. స్వస్త్ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమం కింద మహిళలకు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నామని, ఈ శిబిరాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ



ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): గ్రామంలోని 2,3 అంగన్‌వాడీ కేంద్రాలను సోమవారం జిల్లా కోఆర్డినేటర్ శైలజ తనిఖీ చేశారు. ఈసందర్భంగా రిమోట్ లెర్నింగ్ మెసేజ్(ఆర్ఎల్ఎం)సిలబస్‌లో అంశాలను పిల్లలతో చేయించారు. చిన్నారులచే పాటలు పాడించి, కథలు చెప్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ధనలక్ష్మి, నిర్మలారాణి, హెల్పర్ సుగుణ కుమారి, సునీత, తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు టీకాలు



నందిగామ రూరల్: నాలుగు నెలలు దాటిన ప్రతి పశువుకు విధిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ మోజేస్ వెస్లీ సూచించారు. మండలంలోని మాగల్లు గ్రామంలోని పశువుల ఆస్పత్రిలో చేపట్టిన టీకాల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల్లో గాలికుంటు వ్యాధిని నిరోధించడం ద్వారా పాల ఉత్పత్తి తగ్గకుండా చూసుకోవచ్చన్నారు. మొత్తం 293 పశువులకు టీకాలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారులు వెంకటరావు, చంద్రశేఖర్ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో ఇంజినీర్ల పాత్ర కీలకం



కంచికచర్ల: మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని పరిటాల అమృతసాయి ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం ఇంజినీర్స్ డే వేడుకలు నిర్వహించారు.ఈసందర్భంగా కళాశాల కరస్పాండెంట్ కె. రామ్మోహనరావు మాట్లాడుతూ దేశాభివృద్ధిలో ఇంజినీర్ల పాత్ర కీలకమని పేర్కొన్నారు. అనంతరం మంచి ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. శశిధర్, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ పి.చిరంజీవి, అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్స్ ఎం శ్రీదేవి, వి.రమేష్‌బాబు, డి.పవన్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

మిక్ కళాశాలలో...

కంచికచర్ల మిక్ ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీర్స్ డే వేడుకలు నిర్వహించారు. విద్యార్థులకు పలుపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కళాశాల సీఈఓ డి.పాండురంగారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ టీ వంశీకిరణ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏ దారైనా.. దారుణమే!

- అడుగడుగునా గోతులు
- అధ్వానంగా రోడ్లు
- పట్టించుకోని పాలకులు
- అవస్థల్లో ప్రజలు



అధ్వానంగా ఉన్న కంచికచర్ల-వెల్లంకి రోడ్డు

కంచికచర్ల: నందిగామ నియోజకవర్గంలో పలు రహదారులు ఛిద్రమైపోయి అధ్వానంగా ఉండటంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారంలోకి రాగానే సంపద సృష్టించి రోడ్లను అభివృద్ధి చేస్తామంటూ హామీలు గుప్పించి కూటమి నేతలు ఏడాదిన్నరగా రోడ్ల అభివృద్ధికి తీసుకున్న చర్యలు శూన్యం. దీంతో అధ్వానంగా ఉన్న ఆయా రోడ్లపై ప్రయాణించేందుకు రైతులు, వాహనచోదకులు, ప్రజలు తీవ్ర అవస్థలుపడుతున్నారు.

ప్రమాదాల బారిన ప్రజలు..

నియోజకవర్గంలోని ఆయా రోడ్లు గోతులమయం కావడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రస్తుతం వర్షాలుపడుతుండటంతో వర్షపు నీరు ఆయా గోతుల్లో చేరడంతో ట్రాక్టర్లు, ఆటోలు, ద్విచక్రవాహనాలు గోతుల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నాయి. దీంతో వాహనచోదకులు గాయాలపాలవుతున్నారు. కంచికచర్ల మండలం గండేపల్లి నుంచి వీరులపాడు మండలం నందలూరు వెళ్లే ఆర్అండ్ బీ రోడ్డులో పూర్తిగా రాళ్లులేచి గోతులు ఏర్పడ్డాయి. ఈ రోడ్డుపై నియోజకవర్గ కేంద్రమైన నందిగామ నుంచి వీరులపాడు మండలం నందలూరు, తాటిగుమ్మి, గోకరాజుపల్లి మీదుగా వెల్లంకి, కొనతాణపల్లి, పల్లంపల్లి మీదుగా తెలంగాణ రాష్ట్రం చిలుకూరు, మధిర వరకు నిత్యం వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. అధ్వానంగా ఉన్న ఈ రోడ్డుపై ప్రయాణమంటేనే వాహనచోదకులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణాలు సాగిస్తున్నారు. పంటపొలాల నుంచి వ్యవసాయోత్పత్తులను ఇళ్లకు చేరవేసే క్రమంలో పలు ట్రాక్టర్లు పల్టీకొట్టిన సందర్భాలు కూడా ఉన్నాయి. అదేవిధంగా మండలంలోని కంచికచర్ల నుంచి బత్తినపాడు మీదుగా మోగులూరు ఆర్అండ్‌బీ రోడ్డు రాళ్లులేచి అధ్వాన్నంగా మారింది. ఈ రోడ్డులో నిత్యం కళాశాలలు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల అవస్థలు అన్నీఇన్నీకావు.

వర్షాకాలంలో సాగని ప్రయాణం..

రోడ్లపై పెద్దపెద్ద గోతులు ఏర్పడటంతో ఈ వర్షాకాలంలో ప్రయాణం చేయడం కష్టంగా మారిందని వాహనచోదకులు వాపోతున్నారు. ఎక్కడ ఏ గోయి ఉందో తెలియకపోతుండటంతో ఏమాత్రం ఆదమరిచినా ప్రమాదాలు తప్పేలా లేవని ఆందోళన చెందుతున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సీఎం చంద్రబాబు ప్రభుత్వం స్పందించి నందిగామ నియోజకవర్గంలోని ఆయా రోడ్ల అభివృద్ధికి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వర్షాకాలంలో ఇబ్బందులు



చెవిటికల్లు నుంచి మోగులూరు, మున్నలూరు వెళ్లాలంటే భయమేస్తుంది. వర్షాకాలంలో లక్ష్మయ్యవాగు, నల్లవాగు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయి. అధికారంలోకి రాగానే రోడ్లన్నీ అభివృద్ధి చేస్తామన్న కూటమి నాయకులు ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టలేదు.

–వెలగలేటి వాసు, చెవిటికల్లు, కంచికచర్ల మండలం

రోడ్లు అభివృద్ధి చేయాలి...



కంచికచర్ల మండలం కీసరలో ఐదెకరాల్లో పత్తి, మిర్చి పంట సాగుచేసా. నిత్యం రామిరెడ్డిపల్లి నుంచి బైక్‌పై కీసర వెళ్లాల్సి ఉంటుంది. ప్రస్తుత వర్షకాలంలో గోతులమయమైన ఈరోడ్డులో ప్రయాణం ప్రమాదభరితంగా మారింది. అధ్వానంగా ఉన్న రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

–కట్టా మరియన్న, రామిరెడ్డిపల్లి, నందిగామ మండలం

రోడ్లు ఇలా..ప్రయాణం సాగేదెలా?



మోకాలిలోతు గుంతలతో అధ్వానంగా ఉన్న బండిపాలెం-చెరువుకొమ్ముపాలెం రోడ్డు



వర్షాలకు చిత్తడిగా మారిన రోడ్డు

నందిగామరూరల్: రంఠందిగామ మండలంలోని చెరువుకొమ్ముపాలెం నుంచి జగ్గయ్యపేట మండలం బండిపాలెం గ్రామానికి వెళ్లే పంచాయతీరాజ్ రోడ్డుకు మోకాలిలోతు గుంతలు ఏర్పడ్డాయి. నందిగామ మండలం చెరువుకొమ్ముపాలెం, పెద్దవరంతోపాటు మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు జగ్గయ్యపేట మండలం బండిపాలెం, వేదాద్రి గ్రామాల మీదుగా జగ్గయ్యపేటకు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఏడు కిలోమీటర్లు ఉన్న ఈ రోడ్డులో ప్రయాణమంటే గంటకుపైగా పడుతుంటే పరిస్థితి ఎలా ఉందనేది ఇట్టే అర్థమవుతుంది. గుంతలు పడిన ప్రతిసారీ మట్టి, గ్రావెల్‌తో గుంతలు పూడ్చుతూ అధికారులు చేతులు దులుపుకుంటున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ రోడ్డుకు ఇరువైపులా ఉన్న పొలాలకు ఎరువు కట్టలు, పొలాల నుంచి వ్యవసాయోత్పతుల తరలింపునకు రైతులు అవస్థలుపడుతున్నారు.

డ్రైవర్లకు కత్తిమీద సామే..

ఈ రోడ్డులో ఉన్న పెద్దవరంలోని క్రక్స్ బయోటెక్స్ కంపెనీకి ముడిసరుకు తరలించే భారీ వాహనాలు సైతం ఇదే రహదారిపై రాకపోకలు సాగిస్తుంటాయి. వర్షాలు కురిసిన సమయంలో గుంతల్లో మట్టి తోలిన ప్రాంతాలలో భారీ వాహనాలు ఇరుక్కుపోయిన ఘటనలు సైతం ఉన్నాయి. ఇక సుబాబుల్ వాహనం బోల్తా పడినా వాటిని తొలగించే వరకు రహదారిపై రాకపోకలు నిలిచిపోతాయని రైతులు చెబుతున్నారు. ఈరోడ్ల అభివృద్ధికి అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోతుండటంపై రైతులు, వాహనచోదకులు మండిపడుతున్నారు. ఇకనైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి ఈ రోడ్ల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు, రైతులు కోరుతున్నారు.



గోకరాజుపల్లి రోడ్డు పరిస్థితి ఇది



జమ్మవరం-గోకరాజుపల్లి మధ్య ధ్వంసమైన రోడ్డు

పింఛన్లు పంపిణీ నుంచి తప్పించాలని వినతి



ఏఓ సిద్దారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

పెనుగంచిప్రోలు: సామాజిక పింఛన్లు పంపిణీ విధుల నుంచి తమను తప్పించాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏఓ కె.సిద్దారెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గతేడాది జూలై నెల నుంచి పింఛన్ల పంపిణీ చేస్తున్నామని, ఇప్పటికే తెల్లవారు జామునే ఎక్కువ మొత్తంలో డబ్బులు తీసుకెళ్లి పంచే విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ప్రీస్కూల్, గర్భిణీలు, బాలింతలకు ఫుడ్ పంపిణీ, వివిధ రకాల సర్వేలు, రిపోర్టులు తదితర పనులతో పనిభారం పెరిగిందన్నారు. ఇప్పుడు పింఛన్లు కూడా పంపిణీ చేయాల్సి రావడం మరింత ఇబ్బందికరంగా ఉన్నందున, పింఛన్ల పంపిణీ విధుల నుంచి తమను తప్పించాలని వారు కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సువర్చల, నాగమణి, విమల, రాజ్యలక్ష్మి, సునీత, మంజుల తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు.. ఫీవర్ సర్వే



తక్కెళ్లపాడులో శుభ్రం చేసిన నీటితొట్టె



గండ్రాయిలో ఫీవర్ సర్వే చేస్తున్న వైద్యసిబ్బంది

సాక్షి ఎఫెక్ట్

జగ్గయ్యపేట: జగ్గయ్యపేట నియోజకవర్గంలోని గ్రామాల్లో జ్వరాలు ప్రబలుతున్నవైనం 'గ్రామాల్లో జ్వరాల విజృంభన' శీర్షికన ప్రచురించిన కథనానికి ఆయాశాఖల అధికారులు స్పందించారు. పంచాయతీ అధికారులు మండలాల్లోని ఆయా గ్రామాల్లో సోమవారం పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. మురుగు కాల్వలో పూడిక తీయించడంతో పాటు బ్లీచింగ్ చల్లించారు. వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది గ్రామాల్లో ఫీవర్ సర్వే చేపట్టారు. మండలంలోని తక్కెళ్లపాడు గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలోని నీటితొట్టెను శుభ్రం చేయడంతోపాటు డ్రైన్‌లలో పూడిక తీయించారు. గండ్రాయి వైద్యాధికారి కీర్తిరెడ్డి పలు గ్రామాల్లో జరుగుతున్న ఫీవర్ సర్వేను పరిశీలించారు.

ఉద్యోగులకు వెంటనే డీఏ విడుదల చేయాలి

మాజీఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

జగ్గయ్యపేట అర్బన్: కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు అయినప్పటికీ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఒక్క డీఏ కూడా ఇవ్వలేదని, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు డిమాండ్ చేశారు. పట్టణంలోని జెడ్పీ బాలుర హైస్కూల్‌లో యూటీఎఫ్ రణభేరి బైకు జాతా కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, ఈ దసరాకు కనీసం 2 డీఏలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పీఆర్సీ కమిషనర్‌ను నియమించి మధ్యంతర భృతి ప్రకటించాలని కోరారు. రిటైర్డ్ ఉద్యోగులకు గ్రాట్యుటీ చెల్లించాలన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షురాలు ఏఎన్ కుసుమకుమారి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు తీవ్రమైన బోధనేతర పనులతో ఒత్తిడిలో ఉన్నారన్నారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుందరయ్య మాట్లాడుతూ ఈనెల 25న యూటీఎఫ్ ఆధ్వర్యంలో జరిగే రాష్ట్రస్థాయి సదస్సు జయప్రదం చేయాలని కోరారు. . కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు ఎస్పీ మనోహర్ కుమార్, కె.ఉమామహేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, సహాధ్యక్షులు ఎం.కృష్ణయ్య, పి.లీల, జిల్లా కార్యదర్శులు డి.హరిప్రసాద్, జె.సుధానంద్, సూర్యనారాయణ, ఫ్రైమర్ సాహెబ్, గంగరాజు, జగ్గయ్యపేట మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎ.నరసింహారావు, ముక్తేశ్వరరావు, నాయక్, పల్లవి, జయసుధ, కవితారాణి, వత్సవాయి, పెనుగంచిప్రోలు మండల నాయకులు షేక్ హుస్సేన్, ఆజ్మీరు శ్రీను, సుబ్రహ్మణ్యం, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

డీఏ బకాయిలు చెల్లించాలంటూ టీచర్ల ఆందోళన

నందిగామటౌన్: ఉపాధ్యాయులకు న్యాయంగా రావాల్సిన డీఏలు, పీఆర్సీలు, తదితర అలవెన్స్‌లను అందించడంలో ప్రభుత్వం అలసత్వం వహిస్తోందని ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి రాజ్‌కుమార్ పేర్కొన్నారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించటంతో పాటు రావాల్సిన అన్ని బకాయిలను తక్షణమే విడుదల చేయాలని కోరుతూ స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. నాయకులు శ్రీహరి, కొండనాయక్, నరసయ్య, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, పాండు, అనంత, శ్రీను, కాజా, నరసింహారావు, రవూఫ్, వేణు తదితరులు

పథకాలను అందజేయాలని టైలర్ల వినతి

నందిగామ టౌన్: ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్న టైలర్స్‌కు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి వారి అభివృద్ధికి సహకరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కటారపు గోపాల్ కోరారు. గత ప్రభుత్వంలో మాదిరిగా తమకు పథకాలు అందించి ఆదుకోవాలని కోరుతూ టైలర్లు సోమవారం తహసీల్దార్ సురేష్‌బాబును కలసి వినతిపత్రం అందజేశారు.

ప్రస్తుత కూటమి ప్రభుత్వం పథకాలు అందించకపోవడంతో ఇబ్బందిపడుతున్నామని, ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసినవారిలో టైలర్లు తిరుమలదేవి, కరీమా, నాగలక్ష్మి, గౌసియా తదితరులు ఉన్నారు.

పీజీఆర్ఎస్‌కు 14 అర్జీలు

నందిగామరూరల్: ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 14 అర్జీలు అందాయని ఆర్డీవో బాలకృష్ణ తెలిపారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో రెవెన్యూ శాఖకు సంబంధించి 11అర్జీలు, సర్వే కోసం రెండు, సివిల్ సప్లయ్‌కు సంబంధించి ఒక అర్జీ వచ్చినట్లు తెలిపారు. అర్జీలను ఆయా శాఖాధికారులకు పంపించి పరిష్కరించనున్నట్లు వివరించారు. ప్రజా సమస్యలను వేగవంతంగా పరిష్కరించేందుకే ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఆక్రమణదారులపై ఆర్డీవోకు ఫిర్యాదు

నందిగామరూరల్: మండలంలోని తొర్రగుడిపాడు గ్రామ పరిధిలోని ప్రభుత్వ భూమిలో కొంత భాగం అక్రమణకు గురైందని సర్పంచ్ చెరుకూరు హైమారావు తెలిపారు. ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆర్డీవో బాలకృష్ణకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20ఏళ్ల కిందట ఆర్ఎస్ నెం. 61/2లో 1.42 ఎకరాల భూమిని నివేశన స్థలం కోసం ప్రభుత్వం కొనుగోలు చేసిందన్నారు. సదరు భూమిలో కొంత భాగం ఆక్రమణలకు గురైందని, వెంటనే స్పందించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో చెరుకూరు సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్లను ఆదుకోవాలని డిమాండ్



కీసర(కంచికచర్ల): పాస్టర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించి వారిని ఆదుకోవాలని పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మార్కపూడి డేవిడ్ డిమాండ్ చేశారు. మండలంలోని కీసర రక్షణ సువార్త ప్రార్థనా మందిరంలో సోమవారం నియోజకవర్గ స్థాయి పాస్టర్ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డేవిడ్ మాట్లాడుతూ పాస్టర్లకు ఇళ్లస్థలం, ఇల్లు మంజూరు చేయాలని కోరారు. గౌరవవేతనం ఇవ్వాలన్నారు. క్రైస్తవులపై దాడులు జరగకుండా ప్రత్యేకమైన చట్టాలు తీసుకురావాలని కోరారు. సమావేశంలో పాస్టర్ల సంఘ నాయకులు జయరాజు, తిమోతి, జాషువా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'తన్నీరు' జన్మదిన వేడుకలు



పేటలో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



పెనుగంచిప్రోలులో కేక్ కట్‌చేస్తున్న నాయకులు

జగ్గయ్యపేట అర్బన్: వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు జన్మదిన వేడుకలు సోమవారం ఆ పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ జగ్గయ్యపేట పట్టణ అధ్యక్షుడు పఠాన్ ఫిరోజ్‌ఖాన్, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మండవ శ్రీనివాసగౌడ్, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి నంబూరి రవి, రాష్ట్ర ఎస్సీసెల్ కార్యదర్శి దర్శనాల వెంకటరమణ, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి శివరాత్రి పృధ్వీరాజ్ తదితరులు కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు.

తన్నీరు నాగేశ్వరరావుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో రోగులు, గర్భిణీ స్త్రీలకు పండ్లు, పాలు, బ్రెడ్ పాకెట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి మాతంగి నాగబాబు, జిల్లా రైతు విభాగం కార్యదర్శి మోరె దుర్గాప్రసాద్, జవ్వాజి నరసింహారావు, గడ్డం రామకృష్ణ, పిడమర్తి ప్రభు, కనుగుంట్ల బాలస్వామి, పింగళి నర్సింహారెడ్డి, రామిని ఉపేందర్‌రెడ్డి, గొట్టిపాళ్ల సురేష్, కరిసె ఇశ్రాయేలు, షేక్ నాగుల్ మీరా, పల్లెబోయిన ఉమారామ్ తదితరులు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలులో...

పెనుగంచిప్రోలు: వైఎస్సార్‌సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జీ తన్నీరు నాగేశ్వరరావు జన్మదిన వేడుకలను పెనుగంచిప్రోలులో సోమవారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి తన్నీరుకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల రామారావు, మండల పార్టీ అధ్యక్షులు పొన్నం కోటేశ్వరరావు, గ్రామాధ్యక్షుడు గుడిమెట్ల శంకర్, నాయకులు జి.వెంకటరత్నం, దేరంగుల శ్రీనివాసరావు, మెండెం రామారావు, చేని కుమారి, చేని రాంబాబు, తమ్మిశెట్టి సోమయ్య, బొడ్డు రవి, చుంచు బెనర్జీ, పోపూరి రామోటేశ్వరరావు, మల్లెబోయిన సైదులు, ఎస్.వెంకటేష్, చింతమాల రాంబాబు, ఎన్.ప్రవీణ్, పాల్గొన్నారు.

కంచికచర్ల : ప్రభుత్వ ఉద్యోగుల, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను తక్షణమే ప్రభుత్వం విడుదల చేయాలని, సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని ఏపీటీఎఫ్(ఆల్ ఇండియా టీచర్స్ ఫెడరేషన్) రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎం.అనిత, జిల్లా ఉపాధ్యక్షుడు పూర్ణచంద్రరావు డిమాండ్ చేశారు. కంచికచర్ల రెవెన్యూ కార్యాలయం వద్ద సోమవారం ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘ నాయకులు నిరసన ప్రదర్శన చేశారు. సంఘ నాయకులు ప్రభుకిషోర్, శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళన



ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సిఐటియూ, యూనియన్ నాయకులు

నందిగామ రూరల్: ట్యాక్సీ నంబర్ ప్లేట్ వాహనాలకు నందిగామ ఆర్టీవో కార్యాలయ వద్దనే బ్రేక్ చేయించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కటారపు గోపాల్ డిమాండ్ చేశారు. ట్యాక్సీ వాహనాలకు పాత పద్ధతిలోనే సేవలందించాలని కోరుతూ స్థానిక ఆర్టీవో కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో కారు, ఆటో, తదితర వాహనాల డ్రైవర్లు, యజమానులతో కలిసి సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్యాక్సీ ప్లేట్ వాహనాలకు గత ప్రభుత్వ హయాంలో నందిగామ ఆర్టీవో కార్యాలయంలోనే బ్రేక్ చేసేవారన్నారు. కాని కూటమి పాలనలో వాహనాల బ్రేక్ విధానాన్ని నున్నలోని ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించడంతో వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పాత విధానంలోనే వాహన సేవలందించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో బాలకృష్ణను కలిసి ఈమేరకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు కోట కళ్యాణ్, సయ్యద్ ఖాశీం, కరి వెంకటేశ్వరరావు, గోపీనాయక్, ట్యాక్సీ వర్కర్స్ యూనియన్ నాయకులు కొమ్ము వందు, నరసింహారావు, శేషగిరి, మోహనరావు, కరీమ్, సంజీవరావు తదిరులు పాల్గొన్నారు.

వ్యర్థాల తొలగింపు పనులు ప్రారంభం



జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని ముక్త్యాల రోడ్‌లో విలియంపేట వద్ద ఉన్న మున్సిపల్ చెత్త డంపింగ్ యార్డులో లెగసీ వ్యర్థాల తొలగింపు పనులను ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య), మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చెత్త డంపింగ్ యార్డు సమస్య పరిష్కారం కావడం శుభపరిణామమన్నారు. పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి తీవ్ర ముప్పుగా మారిన వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో తొలగించి శుభ్రం చేయనున్నట్లు వివరించారు. లెగసీ వ్యర్థాల తొలగింపు ప్రక్రియ బయో మైనింగ్ పద్ధతిలో కొనసాగుతుందన్నారు. చెత్తలోని వ్యర్థాలను వేరు నుంచి ఇసుక-రాళ్లు, మండే వ్యర్థాలు, రీసైక్లింగ్ వస్తువులుగా విభజిస్తారని వివరించారు. సమస్యను కౌన్సిల్ మీటింగ్‌లో ప్రస్తావించి పరిష్కారానికి కృషి చేసిన కౌన్సిలర్ నకిరిగంటి వెంకట్‌ను అభినందించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.